హిందూమతంలో కులాల పిచ్చి పెరిగింది..!

● శాంతికి, సమానత్వానికి రూపమైన బౌద్ధమతంలోకి వెళ్తున్నా: మంత్రి మహదేవప్ప



బెంగళూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): హిందూమతంలో కులాల పిచ్చి కొనసాగుతోందని, ఎటువంటి మార్పులు రావడం లేదని బౌద్ధ మతాన్ని స్వీకరిస్తున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మహదేవప్ప ప్రకటించారు. సోమవారం ధర్మచక్ర పరివర్తనా దినాన్ని పురస్కరించుకుని సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారు. హిందూమతంలో కులాల ప్రాధాన్యం జబ్బు వీడ లేదని, ఇకపై మార్పులు వచ్చే లక్షణాలు కనిపించడం లేదన్నారు. స్వాతంత్ర్యం, సమానత్వం, భ్రాతృత్వాన్ని బోధించే బౌద్ధ మతాన్ని ఇష్టపడతానని రాసుకున్నారు. వ్యక్తి ఎదుగుదలకు కరుణ, సమానత్వం ముఖ్యమని ప్రస్తావించారు. కుల పిచ్చితో ఉన్న హిందూమతంలో మార్పు వచ్చే లక్షణాలు ఎక్కడా సాధ్యం కావడం లేదన్నారు. అలాంటి మార్పు త్వరలో రావాలన్నారు. అందుకే సమానత్వం, శాంతికి రూపమైన బౌద్ధ ధర్మాన్ని స్వీకరిస్తానని ప్రకటించుకున్నారు. భారత మూల మతంగా బౌద్ధధర్మాన్ని ప్రచారం చేయాలని భావిస్తున్నట్లు స్పష్టం చేశారు. కాగా మైసూరు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి హోదాలో ప్రతిష్ఠాత్మక మైసూరు దసరా ఉత్సవాల్లో ఆయన క్రియాశీలకంగా వ్యవహరించారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాలు విజయవంతమయ్యేందుకు దాదాపు 20రోజులుగా మైసూరులోనే ఉంటూ పర్యవేక్షించారు. సాక్షాత్తు మంత్రే హిందూమతంపై విరుచుకుపడడం ఆశ్చర్యం కలిగిస్తోంది. దసరా ముగిసిన ఒక్కరోజులోనే ఆయన ఈ నిర్ణయాన్ని ప్రకటించడం సర్వత్రా చర్చకు కారణమవుతోంది.

వాహనాల్లో అడవులకు తరలింపు





ప్యాలెస్‌లో గజరాజులకు వీడ్కోలు ఇలా...

తరలివచ్చిన నగర ప్రజలు



గజరాజులకు వీడ్కోలు..!

బెంగళూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మైసూరు దసరా ఉత్సవాల్లో పాల్గొన్న 14 గజరాజులు అడవికి బయల్దేరాయి. సోమవారం ప్యాలెస్ ప్రాంగణంలో జిల్లా అధికారులు, ప్యాలెస్ పాలకవర్గ మండలి ముఖ్యులు గజ రాజులకు సంప్రదాయబద్ధంగా వీడ్కోలు పలికారు. దసరా వేడుకలకోసం రెండు విడతలుగా 14 ఏనుగులు ప్యాలెస్‌కు తరలి వచ్చాయి. 54రోజులపాటు ప్యాలెస్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టెంట్‌లలో ఏనుగులు గడిపాయి. జంబూసవారిలో అభిమన్యు సారథ్యంలో ఇతర గజరాజులు గంభీరంగా భాగస్వామ్యులయ్యాయి. ప్యాలెస్ ముందుభాగాన ఏనుగులకు సంప్రదాయబద్ధంగా పూజలు జరిపించారు. ఏనుగులకు చెరుకు, బెల్లంతోపాటు వివిధ పండ్లు అందించారు. మావటీలు, కాపలాదారులు, వారి కుటుంబీకులు ఏనుగులతో కలసి వెనుదిరిగారు.



లారీల్లో..

దర్శన్ బెయిల్ పిటిషన్

కొట్టివేత



బెంగళూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ రేణుకాస్వామి హత్యకేసులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న నటుడు దర్శన్, ఏ1 నిందితురాలు పవిత్రగౌడల బెయిల్ పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. సోమవారం 57వ సీసీహెచ్ కోర్టు తీర్పును ప్రకటించింది. హత్య కేసులో జూన్ 11న దర్శన్‌ను అరెస్టు చేశారు. ఇటీవలే చార్జ్‌షీట్ దాఖలు చేయడంతో దర్శన్ తరపు న్యాయవాదులు సెప్టెంబరు 21న బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. సుదీర్ఘ విచారణ జరిపిన న్యాయస్థానం వారంక్రితమే ప్రక్రియను ముగించి తీర్పును పెండింగ్‌లో ఉంచారు. అక్టోబరు 14న సోమవారం తీర్పు ప్రకటిస్తామని న్యాయమూర్తి జయశంకర్ వెల్లడించారు. దీంతో పరప్పన అగ్రహార జైలులో ఉన్న పవిత్రగౌడ, బళ్ళారి జైలులో ఉన్న దర్శన్ బెయిల్ తీర్పుకోసం ఎదురు చూశారు. న్యాయమూర్తి జయశంకర్ సోమవారం సా యంత్రం బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసినట్టు ప్రకటించారు. దీంతో దర్శన్ మరింత కాలం జైలులోనే గడపాల్సి ఉంటుంది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రసన్నకుమార్ వాదనలు వినిపించగా దర్శన్ తరపున సీనియర్ న్యాయవాది సీవీ నగేశ్ వాదించారు. కాగా బెయిల్ తీర్పు ఎలా ఉంటుందోనని ఆదివారం రాత్రి జైలులో దర్శన్ తీవ్రమైన ఒత్తిడితో గడిపినట్లు సమాచారం. బెయిల్ వస్తుందో, రాదోనని ఆవేదనతో గడిపినట్లు తెలుస్తోంది. తీవ్రమైన వెన్నునొప్పి ఉందని, బెంగళూరులో చికిత్స జరిపించుకోవాలని దర్శన్ ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. ఏ11 నాగరాజు, ఏ12 లక్ష్మణ్ బెయిల్ పిటిషన్‌లనూ కొట్టివేశారు. ఏ13 దీపక్, ఏ8 రవిశంకర్‌కు కోర్టు బెయిల్ మంజూరు చేసింది.

రిజిస్ట్రేషన్లకు ఆధార్

తప్పనిసరి

- నెలరోజుల్లోనే 60శాతం అమలు
- అక్రమాలకు చెక్ పెట్టడమే ప్రభుత్వ ధ్యేయం
- కేంద్ర అంగీకారం కోసం రాష్ట్రం యత్నాలు



నగరంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయం

బెంగళూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ వేళ వ్యక్తిగత గుర్తింపు కార్డులు ఆధార్, పాస్‌పోర్ట్ లేదా పాన్‌కార్డుల్లో ఏదైనా ఒకటి తప్పనిసరిగా సమర్పించాలన్న ప్రభుత్వ నిర్ణయానికి ఉత్తమ స్పందన లభించింది. నెలరోజుల వ్యవధిలోనే 60శాతం రిజిస్ట్రేషన్‌లకు ఆధార్‌కార్డు తప్పనిసరిగా నమోదు చేయడం కనిపిస్తోంది. నకిలీ గుర్తింపుకార్డులు జతచేసి, నకిలీ వ్యక్తులను సృష్టించి ఆస్తులు రిజిస్ట్రేషన్ చేసుకుని దందాలకు పాల్పడేవారిని నియంత్రించేందుకు రిజిస్ట్రేషన్ శాఖ కొత్తనిబంధనలకు శ్రీకారం చుట్టింది. రిజిస్ట్రేషన్లకు మూడు గుర్తింపుకార్డులను తప్పనిసరి చేస్తూ సెప్టెంబరులో నిర్ణయం తీసు కున్నారు. రానున్న రోజుల్లో పాస్‌పోర్ట్, పాన్‌కార్డులు కాకుండా కేవలం ఆధార్‌కార్డు ద్వారా మాత్రమే రిజిస్ట్రేషన్లు కొనసాగించదలిచారు. ఇదే విషయాన్ని కేంద్ర ప్రభుత్వ అనుమతులకోసం రాష్ట్రప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. బెంగళూరుతోపాటు అన్ని రాష్ట్రంలోని అన్ని నగరాలు, పట్టణాలలో భూములు ధరలు పెరిగిన తరుణంలో ప్రభుత్వం ఏడాది కాలంగా నకిలీ రిజిస్ట్రేషన్లకు చెక్ పెట్టాలని నిర్ణయించింది. స్థిరాస్తులు మార్కెట్‌ధర కంటే అధికంగా పలుకుతుండడంతో భూ విక్రయాల్లోనూ పలు అక్రమాలు, అవినీతి వ్యవహారాలు కొనసాగుతున్నాయి. ఎవరో భూమిని మరొకరు రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. బినామీ వ్యక్తులు ఆస్తులు రిజిస్ట్రేషన్ చేసుకోవడంతో అసలు భూయజమానులకు కోర్టుల చుట్టూ తిరగక తప్పడం లేదు. మధ్యవర్తుల ద్వారా రాజీలు చేసుకునేలా ప్రయత్నిస్తూ భారీ దందాలకు గురవుతున్నారు. ఇందులో రాజకీయనేతలు, రౌడీలు, పోలీసులతోపాటు రియల్టర్ దందాలు ఇటువంటి అక్రమ వ్యవహారాలతోనే కోట్లాదిరూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. జీవితకాలం సంపాదించి మిగుల్చుకున్న సొమ్ములో ఆస్తులు కొనుగోలు చేసి అన్యాయానికి గురైతే



ఆ కుటుంబం తీవ్రమైన సంక్లిష్ట పరిస్థితి ఎదుర్కొంటుంది. ఇలాంటి అక్రమాలకు పోలీసులు కూడా జోక్యం చేసుకోవడం లేదు. సివిల్ వ్యాజ్యం అంటూ దాటవేస్తున్నారు. కోర్టులకు వెళ్లి తేల్చుకోవాలంటున్నారు. కానీ వారికి అనుకూలమైతే మాత్రం రాజీలు చేస్తున్నారు. ఇది రాష్ట్రంలోనే కాకుండా దేశమంతటా తీవ్రమవుతోంది. ఈ పరిస్థితిపై రెవెన్యూశాఖ స్టాంపులు, రిజిస్ట్రేషన్‌ల విభాగం అధికారులు సుదీర్ఘకాలంపాటు పరిశీలనలు జరిపి ఒక నిర్ణయానికి వచ్చారు. స్థిరాస్తుల రిజిస్ట్రేషన్‌లలో ఆధార్ కార్డు తప్పనిసరి చేశారు. తొలుత ప్రయోగాత్మకంగా అమలు చేయదలిచారు. అయితే తొలి మాసంలోనే 60శాతం మంది సానుకూలంగా స్పందించారు. దీంతో ఇదే విధానం శాశ్వతంగా అమలు చేయదలిచిన ప్రభుత్వం అనుమతులకు సిద్ధమైంది.

నిబంధనలు సవరించాల్సిన అవసరం

ప్రస్తుతానికి మూడు గుర్తింపుకార్డుల్లో ఏదైనా ఒకటి తప్పనిసరిగా సమర్పించాలని నిర్ణయించారు. రానున్నరోజుల్లో ఆధార్ కార్డులను మాత్రమే పరిగణించాలని అందుకు కేంద్రప్రభుత్వం చట్టం సవరణలు తీసుకొచ్చేలా పార్లమెంటులో బిల్లు సవరించాల్సి ఉంది. కేంద్ర భూవనరుల శాఖ 1908 రిజిస్ట్రేషన్ చట్టాన్ని సవరించాలని రెవెన్యూశాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు. సవరణలు జాప్యమవుతాయనే రాష్ట్ర ప్రభుత్వం కేబినెట్‌లో చర్చించి ఆధార్‌తోపాటు పాన్‌కార్డు, పాస్‌పోర్ట్‌లకు అవకాశం కల్పించారు.

ఆధార్‌కార్డు సమర్పించడం ద్వారా అసలైన భూయజమాని ఎవరనేది సులభంగా ధ్రువీకరించవచ్చు. నకిలీ వ్యక్తుల పేరిట రిజిస్ట్రేషన్‌లు జరిగితే వాటి వివరాలు బహిరంగం కానున్నాయి. ఒకేవ్యక్తి మహిళల పేరిట ఉండే ఆస్తుల వివరాలను బహిరంగం చేసినట్టు అవుతుంది. ఆధార్‌కార్డు ద్వారా రిజిస్ట్రేషన్‌లు చేయడం ద్వారా సదరు వ్యక్తికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలు, ఇతరత్రా వ్యవహారాలు, బ్యాంకు ఖాతాలు సమగ్రంగా తేలనున్నాయి.

నకిలీల నియంత్రణకే ప్రయోగం : రెవెన్యూ మంత్రి



రాష్ట్రవ్యాప్తంగా భూముల ధరలు అమాంతంగా పెరిగాయని తాలూకా కేంద్రాలు, పట్టణాలు, జిల్లా కేంద్రాలతోపాటు బెంగళూరు, మైసూరు, మంగళూరు నగరాలలో ఆకాశాన్నంటాయని రెవెన్యూమంత్రి కృష్ణబైరేగౌడ అభిప్రాయపడ్డారు. భూముల ధరలు పెరగడంతో దందాలు చేసేవారు పెరిగారని, భూయజమానులకు అన్యాయం జరగకుండా కట్టడి చేయాలనే ఆధార్‌కార్డుతోపాటు మరో రెండు గుర్తింపుకార్డులను తప్పనిసరి చేశామన్నారు. నకిలీ రిజిస్ట్రేషన్‌లను పూర్తిస్థాయిలో అరికడతామన్నారు. తద్వారా భూ క్రయ, విక్రయాల్లో ఎటువంటి అక్రమాలకు తావు లేకుండా చూస్తామన్నారు.



ఆరు బయటే పడేసిన మూడు చక్రాల వాహనాలు

తుప్పు పడుతున్నా.. తప్పు కాదంట..!

● ఎండకు ఎండి వానకు తడుస్తున్న మూడు చక్రాల వాహనాలు ● దివ్యాంగులకు పంపిణీ చేయని అధికారులు

గంగావతి రూరల్, అక్టోబరు 14: దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడు చక్రాల వాహనాలు వారికి చేరకపోగా ఎండకు ఎండి, వానకు తడిసిపోతున్నాయి. ఎన్నికల సమయంలో కోడ్ కారణంగా వాటి పంపిణీని నిలిపివేశారు. ఎన్నికలు ముగిసి నాలుగు నెలలైనా వీటిపై అధికారులు ఏమాత్రం చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు దారి తీస్తోంది. మూడు చక్రాల స్కూటర్లు తడిసి తుప్పుపట్టే స్థితికి చేరుకున్నా.. పంపిణీ చేపట్టడం లేదు. గత ఏడాది 2023-24 ఆర్థిక సంవత్సరంలో దివ్యాంగుల కోసం మూడు స్కూటర్లను పంపిణీ చేసే ఉద్దేశ్యంతో లబ్దిదారుల జాబితాను సిద్ధం చేశారు. 2024 ఆర్థిక సంవత్సరం ముగియడానికి వచ్చినా ఇంతవరకు పంపిణీ చేపట్టకపోవడంపై దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొప్పళ నగరంలోని సురభి వృద్ధాశ్రమంలో జిల్లాలో లబ్దిదారులకు ఇవ్వాల్సిన 125 త్రిచక్ర స్కూటర్లు ఆరుబయటే పడేశారు. ఈ విషయంపై ప్రశ్నిస్తే అధికారులు కంటితుపుడు మాటలు చెబుతున్నారు. స్కూటర్లు పంపిణీ చేసిన సంస్థ ఇంతవరకు వాహనాలకు చెందిన రిజిస్ట్రేషన్ కార్డులు అందజేయలేదని, అందుకే అవి పంపిణీ చేయలేదని సాకులు చెబుతుండడం విడ్డూరం. అయినా ఎండలో తడిసినా వాటికేమీ కాదని, పాడయిపోయేదేమీ లేదని నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారు. లబ్దిదారులకు అవసరమైన సమయంలో పంపిణీ చేస్తే బాగుంటుందని, తుప్పు పట్టి చెడిపోయిన స్కూటర్లను ఇవ్వడం ద్వారా ప్రయోజనం లేదని, ఈ నేపథ్యంలో అధికారులు సరైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని దివ్యాంగులు అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

సండూరుపై సీఎం వరాలజల్లు..



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీఎం సిద్దరామయ్య

బళ్లారి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): బళ్లారి జిల్లా సండూరుపై సీఎం సిద్దరామయ్య వరాలు కురిపించారు. సోమవారం సండూరులో డిప్యూటీ సీయం డీకే శివకుమార్, ఎంపీ తుకారామ్, మంత్రి సంతోష్ లాడ్ కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. సండూరులో రూ. 160 కోట్లతో స్వచ్ఛత తాగునీటి పథకాన్ని ప్రారంభించారు. అమృత యోజన కింద నారీహళ్లి జలాశయం నుంచి శుద్ధ తాగునీటిని అందించేందుకు రూ. 55.45 కోట్లుతో నిర్మించిన నీటి పథకాన్ని ఆయన ప్రారంభించారు. కనకభవన్ వద్ద రూ. 2.50 కోట్లతో అభివృద్ధి పనులకు ఆయన భూమిపూజ చేపట్టారు. వెనుకబడిన, లింగాయత్, కురుబ, యాదవ, వివిధ కులస్తులకు సంబంధించి సముదాయ భవనాల కోసం 7.50 కోట్లతో భవన నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీఎం పలు వరాలను ప్రకటించారు. తోరణగల్లు గ్రామంలో రూ. 2 కోట్లతో స్వతంత్ర్య పదవీపూర్వ కళాశాలను మంజూరు చేశారు. సండూరు పట్టణంలో 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సండూరు తాలుకా అంతాపుర గ్రామం వద్ద రూ.56 కోట్లతో విద్యుత్ ఉప కేంద్రాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. సండూరు పట్టణంలో అత్యద్భుతమైన బస్సు నిర్మాణం ఏర్పాటు చేస్తామని తెలిపారు. సండూరుపై వరాలు కురిపించిన ముఖ్యమంత్రి సిద్దరామయ్య అనంతరం ప్రతిపక్షంపై విరుచుకుపడ్డారు. తనపై బీజేపీ నాయకులు అనవసరమైన కుట్రలు పన్నుతున్నారని, సండూరు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమన్నారు. ఉప ఎన్నికల్లో విజయంతో వారి నోళ్లు మూయిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, జిల్లా ఇన్‌ఛార్జ్‌మంత్రి జమీర్ అహ్మద్, మంత్రి సంతోష్ లాడ్, ఎంపీ తుకారామ్, కంప్లి ఎమ్మెల్యే గణేష్, బళ్లారి ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, సిరుగుప్ప ఎమ్మెల్యే నాగరాజు, అల్లం వీరభద్రప్ప, ముండ్రిగి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



నారీహళ్లి జలాశయానికి వాయనం సమర్పిస్తున్న సీఎం, డీసీఎం

బీజేపీ నేతలకు పచ్చకామెర్లు

● హోంమంత్రి పరమేశ్వర్



బెంగళూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): హుబ్బళ్ళి వివాదానికి సంబంధించి కేసుల వాపసుపై బీజేపీ ఆందోళనను హోం మంత్రి పరమేశ్వర్ తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ వారికి పచ్చకామెర్లని అందుకే ప్రతి విషయాన్ని రాజకీయం చేస్తారన్నారు. సోమవారం సదాశివనగర్‌లోని ఆయన నివాసం వద్ద మీడియాతో మాట్లాడుతూ కేసుల వాపసు అనేది ఒక విధానం ఉంటుందని, ఉన్నఫళంగా రద్దు చేయడం అనేది సాధ్యం కాదన్నారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిపైనా కేసులు ఉండేవని ప్రస్తుతం అన్నీ రద్దయ్యాయన్నారు. వారు చేస్తే సమంజసమని, మేం చేస్తే ఏకపక్షమనేది ఎంతవరకు సమంజసమన్నారు. కేసుల వాపసు నిర్ణయానికి కోర్టు అంగీకరిస్తుందో లేదో... తెలియదన్నారు. కోర్టు అంగీకరిస్తేనే కేసు వాపసు తీసుకుంటామన్నారు. 50 కేసులు ఉన్నాయని, వీటిలో 42 కేసులు మాత్రమే రద్దు చేశామన్నారు. బీజేపీకి ఏ రంగూ కనిపించదని ఎద్దేవా చేశారు. కాగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు అనుబంధమైన సిద్ధార్థ విహార ట్రస్టు భూమి వాపసు చేసిన అంశమై ఎక్కడ తప్పు జరిగిందని వ్యాఖ్యానించలేదన్నారు. ప్రతీదీ వివాదం చేయరాదన్నారు.

లక్కీ లాటరీ..!



హాజరైన దరఖాస్తుదారులు

- మద్యం దుకాణాల లాటరీలో పలువురికి జాక్‌పాట్
- బీజేపీ అనంత జిల్లా అధ్యక్షుడికి ఐదు షాపులు
- మడకశిరలో ఒకే కుటుంబానికి నాలుగు
- అధికార సిండికేట్ కూటమి హవా
- మద్యం దుకాణం దక్కించుకున్న రంగనాథ్ కిడ్నాప్
- లాటరీ కేంద్రం వద్ద భార్య, బంధువుల ధర్నా
- హిందూపురం వన్‌టౌన్ సీఐ ఎదుట రంగనాథ్ ప్రత్యక్షం
- రేపట్నుంచి ప్రైవేటు మద్యం దుకాణాల్లో విక్రయాలు



మద్యం దుకాణాల లాటరీని పరిశీలిస్తున్న కలెక్టర్, జేసీ

పుట్టపర్తి, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు మద్యం దుకాణాల లైసెన్సుల జారీ లాటరీ అధికార కూటమికి లక్కీ లాటరీగా మారింది. జిల్లా కేంద్రం పుట్టపర్తిలోని సాయి ఆరామంలో సోమవారం మద్యం దుకాణాలకు లక్కీడ్రా కలెక్టర్ చేతన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లాలో ఎనిమిది ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 87 మద్యం దుకాణాలకు 1518 దరఖాస్తులు రాగా.. రెండు టేబుళ్లపై లక్కీడ్రా తీశారు. సిండికేట్‌తో మద్యం దుకాణాల్లో 90శాతానికిపైగా అధికార కూటమి నేతలు, అనుచరగణానికే దక్కాయి. కదిరి, ధర్మవరం, హిందూపురం, చెన్నేకొత్తపల్లి, మడకశిర, పెనుకొండ, తనకల్లు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో ఐదారు మినహా అన్నీ అధికార కూటమి వశమయ్యాయి. పుట్టపర్తి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అధికార కూటమి నేతలతోపాటు ఔత్సాహికులు, ప్రతిపక్ష పార్టీ నేతలు సైతం భారీగా దరఖాస్తులు చేశారు. లాటరీలో మిశ్రమంగా దక్కాయి. మద్యం దుకాణాల లాటరీకి సోమవారం ఉదయం నుంచి దరఖాస్తుదారులు సాయిఆరామం వద్దకు క్యూకట్టారు. సిండికేట్‌గా దరఖాస్తులు చేసిన వారిలో టెన్షన్ కన్పించలేదు. మిగతావారిలో మాత్రం ఉత్కంఠ నెలకొంది. మహిళలు సైతం మద్యం దుకాణాలకు పోటీ పడ్డారు. యువతతోపాటు చంటిబిడ్డలతో లాటరీకి హాజరయ్యారు. మడకశిర, పుట్టపర్తి, కదిరి ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు హాజరయ్యారు. లేపాక్షిలో 57వ మద్యం దుకాణం మినహా మిగిలిన 86 షాపులకు లైసెన్సు ఫీజు 1/6 వంతు మొత్తాన్ని చెల్లించారు. కొందరికి దుకాణాలు దక్కకపోవడంతో నిట్టూరుస్తూ వెనుదిరిగారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, డీఆర్వో కొండయ్య, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోవిందునాయక్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ నరసింహులు పాల్గొన్నారు.

లిక్కర్ కిక్కు వారిదే

మద్యం దుకాణాల లక్కీడ్రాలో కొందరిని అదృష్టం వరించింది. ధర్మవరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 20 దుకాణాల్లో మూడు మినహా అన్నీ కూటమి నేతల అనుచరగణానికే దక్కాయి. మంత్రి సత్యకుమార్ యాదవ్ సన్నిహితుడు, బీజేపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులుకు ఐదు దుకాణాలు దక్కాయి. ధర్మవరం మున్సిపాలిటీ, రూరల్‌లో మూడు, బత్తలపల్లి, ముదిగుబ్బలో ఒక్కోటి వశమయ్యాయి. ధర్మవరంలో టీడీపీ నేత శ్రీశైలం పురుషోత్తం గౌడ్, ముదిగుబ్బలో అదే పార్టీకి చెందిన అన్నమనేని శ్రీనివాసులు, రాప్తాడు నియోజకవర్గం కనగానపల్లిలో బిత్తిని హరినాథ్, పెనుకొండ నియోజకవర్గంలోని గోరంట్లలో మద్యం వ్యాపారి ఓరుగంటి రవీంద్రనాథ్‌గౌడ్, కదిరిలో టీడీపీ నాయకుడు కందుకూరు గణేష్‌కు రెండు చొప్పున, మడకశిర నగర పంచాయతీ, గ్రామీణ పరిధిలో పీఎస్ వెంకటసుబ్బారెడ్డికి మూడు, ఆయన భార్య వైజయంతిమాల పేరుతో మరో దుకాణం దక్కాయి. మడకశిర నియోజక వర్గం అమరాపురంలో తల్లికుమారుడు పీఎం పంకజ, పీఎం సుజిత్‌కు రెండు దుకాణాలు దక్కాయి. ఐదు దుకాణాలు దక్కించుకున్న సందిరెడ్డి శ్రీనివాసులు, ఆయన బృందం నియోజక వర్గంలో 27 దరఖాస్తులు సమర్పించారు. మడకశిరలో నాలుగు దకాణాలు దక్కిన పీఎస్ వెంకటసుబ్బారెడ్డి, ఆయన బృందం 29 దరఖాస్తులు చేసినట్లు తెలుస్తోంది. కనగానపల్లిలో రెండు దుకాణాలకు హరినాథ్ 13 దరఖాస్తులు వేశాడు. హిందూపురంలో టీడీపీ, వైసీపీ నేతలు సిండికేట్‌గా మారి, నియోజకవర్గ వ్యవహారాలు చూసే ఇద్దరు పీఏలు ఏకంగా 9 దుకాణాలకు పలు పేర్లపై 40 దరఖాస్తులు చేశారు. పరిగిలో రెండు దుకాణాలకు మంత్రి సవిత, ఎంపీ బీకే పార్థసారథి వర్గీయులు పోటీపడి 86 దరఖాస్తులు చేశారు.

మహిళలకు లక్కీ చాన్స్

మద్యం దుకాణాలకు దరఖాస్తుల్లో మహిళలు పోటీపడ్డారు. ఐదుగురికి మద్యం దుకాణాలు దక్కాయి. హిందూపురం మున్సిపాలిటీలో 50వ దుకాణానికి నాగరత్నమ్మ, మడకశిర నగర పంచాయతీలో 78వ షాపునకు వైజయంతిమాల, అమరాపురంలో 83వ దుకాణానికి పంకజ, పుట్టపర్తి నగర పంచాయతీలో 39కి ప్రశాంతి, గాండ్లపెంటలో టంగుటూరి సురేఖకు దుకాణాలు దక్కాయి. జిల్లా వ్యాప్తంగా పలు దకాణాలకు మహిళలు దరఖాస్తులు చేసి సిండికేట్ ముందు నిలువలేకపోయినట్లు చర్చ సాగుతోంది.



చంటిబిడ్డతో హాజరైన మహిళ

కిడ్నాప్ కలకలం

లక్కీడ్రాలో చిలమత్తూరు మండలం యగ్నిశెట్టిపల్లికి చెందిన రంగనాథ్‌కు లేపాక్షిలో 57 మద్యం దుకాణం దక్కింది. ఉదయం 10 గంటల సమయంలో రంగనాథ్‌ను హిందూపురానికి చెందిన కొందరు చర్చిద్దామని పిలుచుకెళ్లారు. లాటరీ తగిలిన విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో రంగనాథ్‌తో మాట్లాడేందుకు వారు ప్రయత్నించగా.. ఫోన్ స్విచాఫ్ వచ్చింది. రంగనాథ్ భార్య అశ్విని, కుటుంబ సభ్యులు పుట్టపర్తికి వచ్చి ఆరాతీశారు. హిందూపురానికి చెందిన కొందరు టీడీపీ నాయకులు.. రంగనాథ్‌ను తీసుకెళ్లినట్లు తెలుసుకున్నారు. తన భర్తను కిడ్నాప్ చేశారంటూ అశ్విని, బంధువులు.. పుట్టపర్తి అర్బన్ పోలీసు స్టేషన్ హిందూరానికి చెందిన మంగేష్, ఆనంద్‌పై ఫిర్యాదు చేశారు. అనంతరం సాయిఆరామంలో మద్యం దుకాణానికి లైసెన్సు ఫీజు చెల్లిస్తామని ఎక్సైజ్ అధికారులకు విన్నవించారు. దరఖాస్తుదారుడే చెల్లించాలని చెప్పడంతో ప్రధాన ముఖద్వారం ఎదుట ధర్నాకి దిగారు. రంగనాథ్‌ను పిలుచుకెళ్లిన వారు యగ్నిశెట్టిపల్లిలోని బంధువులకు ఫోన్ చేసి, రూ.10 లక్షల గుడ్‌విల్ ఇస్తామనీ, ప్రతినెలా రూ.15వేలు ఇస్తామనీ, అందుకు ఒప్పుకుంటే రేపు సాయంత్రానికి రంగనాథ్ వస్తాడంటూ దర్నాకు దిగిన అతడి బంధువులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. ఫిర్యాదు వెనక్కి తీసుకోవాటంటూ ఒత్తిళ్లు తెచ్చారు. సోమవారం రాత్రిదాకా రంగనాథ్ కిడ్నాప్ హైడ్రామా నడిచింది. ఎట్టకేలకు రంగనాథ్ హిందూపురంలో ప్రత్యక్షమయ్యాడు. వన్‌టౌన్ సీఐ ఎదుట హాజరయ్యాడు. మొబైల్ ఫోన్ మరమ్మతులకు లోనవడంతో భార్య, కుటుంబ సభ్యులతో మాట్లాడలేకపోయాననీ, తనను ఎవరూ కిడ్నాప్ చేయలేదని సీఐ ఎదుట వెల్లడించడంతో కిడ్నాప్ కథ సుఖాంతమైంది.



ధర్నా చేస్తున్న రంగనాథ్ భార్య, బంధువులు

కిక్కు.. కొందరికే లక్కు..!

- జేఎన్‌టీయూలో ముగిసిన లాటరీ ప్రక్రియ
- 136 మద్యం దుకాణాల కేటాయింపు పూర్తి
- 19 దుకాణాలను దక్కించుకున్న మహిళలు



లక్కీ నంబరును చూపుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ ఎన్టీఆర్ ఆడిటోరియంలో మద్యం దుకాణాలను లాటరీ పద్ధతిలో సోమవారం కేటాయించారు. జిల్లాలోని 136 మద్యం దుకాణాలకు 3265 దరఖాస్తులు వచ్చాయి. కొందరు ఎక్కువ దుకాణాలకు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో లాటరీ ప్రక్రియకు 2500 మంది దాకా వచ్చారు. దరఖాస్తుదారులతో వర్సిటీ ప్రాంగణంలో సందడి కనిపించింది. లాటరీ వేదికకు ఉదయం 7 గంటలకే చేరుకోవాలని ఎక్సైజ్ అధికారులు సూచించారు. కొందరు దరఖాస్తుదారులు ముందుగానే చేరుకోగా.. మరికొందరు ఆలస్యంగా వచ్చి పరుగులు పెట్టారు. మహిళలు సైతం గణనీయంగా వచ్చారు. యాభై మందికిపైగా మహిళలు లాటరీ ప్రక్రియలో పాల్గొన్నారు. కలెక్టర్ వినోద్‌కుమార్, జేసీ శివనారాయణ్ శర్మ, ఎస్పీ జగదీష్, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 8 గంటలకు లాటరీ ప్రక్రియ ప్రారంభమైంది. ముందుగా అనంతపురం అర్బన్‌లోని మొదటి దుకాణం డ్రా తీశారు. మధ్యాహ్నం 2గంటలకు మొత్తం దుకాణాల లాటరీలు తీశారు. లక్కీ డ్రా ప్రారంభం కాగానే దరఖాస్తుదారుల్లో ఉత్కంఠ కనిపించింది. అనంతపురం అర్బన్‌లో మొదటి దుకాణానికి 44 దరఖాస్తులు వచ్చాయి. 30వ టోకన్ నంబర్ దరఖాస్తుదారు చల్లా లక్ష్మీనారాయణకు ఆ దుకాణం దక్కింది. రెండో దుకాణం ఎమ్మెల్యే దగ్గుపాటి ముఖ్య అనుచరుడు గంగారామ్‌కు దక్కింది.



ఉరుకులు.. పరుగులు..

అనుచరులకు నిరాశ

అనంతపురం అర్బన్‌లో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అనుచరులు 30 దుకాణాలకు ఏకంగా 300లకుపైగా దరఖాస్తులు సమర్పించారు. లక్కీ డ్రాలో 11 దుకాణాలు మాత్రమే దక్కాయి. మిగిలిన 19 దుకాణాలు మద్యం వ్యాపారులు, తటస్థులకు దక్కాయి. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు రూ.1.70 కోట్లు సొంత డబ్బుతో పార్టీ కార్యకర్తల సంక్షేమం కోసం మద్యం దుకాణాలకు దరఖాస్తులు వేయించారు. మొత్తం 10 దుకాణాలు ఉండగా.. రెండు మాత్రమే అమిలినేని అనుచరులకు దక్కాయి. దీంతో ఎమ్మెల్యేతోపాటు పార్టీ శ్రేణులు ఒకింత నిరుత్సాహానికి గురయ్యారు. ఇక్కడ ఏకంగా 8 దుకాణాలు మద్యం వ్యాపారులు, తటస్థులకు దక్కాయి.

టీడీపీ శ్రేణులకే మెజార్టీ దుకాణాలు

తాడిపత్రి నియోజకవర్గంలో 20 దుకాణాలకుగాను 10కిపైగా జేసీ అనుచరులకే దక్కాయి. రెండు విజయవాడ వ్యక్తులకు దక్కగా.. మిగిలినవి వ్యాపారులు, తటస్థులకు దక్కాయి. రాయదుర్గం నియోజకవర్గంలో 14 దుకాణాలు ఉండగా... 2 వైసీపీ, 2 తటస్థులకు దక్కాయి. 10 దుకాణాలు టీడీపీ శ్రేణులకు దక్కాయి. గుంతకల్లు నియోజకవర్గంలో 23 దుకాణాలు ఉండగా... వైసీపీ, జనసేన, నంది గ్రూప్‌లకు ఒక్కొక్కటి దక్కాయి. మిగిలిన దుకాణాలు స్థానిక ఎమ్మెల్యే అనుచరులు, టీడీపీ నాయకులకు దక్కాయి. రాప్తాడు నియోజకవర్గం పరిధిలోని అనంతపురం రూరల్, ఆత్మకూరు, రాప్తాడు మండలాల్లో మొత్తం 8 దుకాణాలు ఉండగా... రెండు నంది గ్రూప్‌నకు దక్కాయి. ఒకటి తటస్థులకు, మిగిలిన దుకాణాలు టీడీపీ శ్రేణులకు దక్కాయి. ఉరవకొండ నియోజకవర్గంలో మొత్తం 13 దుకాణాలు ఉండగా.. 2 దుకాణాలు వైసీపీ నాయకులకు, ఒకటి తటస్థులకు దక్కాయి. 10 దుకాణాలు టీడీపీ శ్రేణులకు దక్కాయి. శింగనమల నియోజకవర్గంలో 18 దుకాణాలు ఉండగా.. 14 దుకాణాలు టీడీపీ శ్రేణులకు, 3 వైసీపీ శ్రేణులకు, ఒకటి తటస్థుడికి దక్కాయి. జిల్లాలో 136 మద్యం దుకాణాల్లో మెజార్టీ దుకాణాలు టీడీపీ శ్రేణులకు దక్కాయి. వైసీపీ వర్గీయులు ఏడు దుకాణాలను దక్కించుకున్నారు.

మహిళలకు 19 దుకాణాలు



లక్కీ డ్రాకు హాజరైన మహిళలు

జిల్లాలోని 136 దుకాణాల్లో 19 మహిళలకు దక్కాయి. ఇందులో నాలుగు నంద్యాల జిల్లా నంది గ్రూప్ సంస్థలకు చెందిన సుజల దక్కించుకున్నారు. అనంతపురం రూరల్ మండలంలో రెండు, గుంతకల్లు, కళ్యాణదుర్గం రూరల్‌లో ఒక్కొక్క దుకాణాలను దక్కించుకున్నారు. శింగనమల నియోజకవర్గ పరిధిలోని బుక్కరాయసముద్రంలో వైసీపీకి చెందిన పూజారి నారాయణమ్మ లాటరీలో దుకాణం దక్కించుకున్నారు. మిగిలిన 14 దుకాణాలను టీడీపీకి చెందిన మహిళలు దక్కించుకున్నారు.

ప్రతి ఫిర్యాదుకు పరిష్కారం చూపాలి

- భారీ వర్షాలు కురుస్తాయ్.. జాగ్రత్తగా ఉండండి
- అధికారుల సమీక్షలో కలెక్టరు వినోద్ కుమార్



బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టరు వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల వేదికకు వచ్చే ప్రతి బాధితుడి సమస్యను పరిశీలించి పరిష్కారం చూపాలని అధికారులకు కలెక్టరు డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. పలువురు బాధితులు తమ సమస్యలపై అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కలెక్టరుతో పాటు డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డి, డిప్యూటీ కలెక్టరు ఆనంద్ తదితరులు 253మంది బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం అధికారులతో కలెక్టరు సమీక్ష నిర్వహించారు. ఫిర్యాదులు పెండింగ్ ఉండకుండా సకాలంలో పరిష్కరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

జనరేటర్ బ్యాకప్ ఉండాలి..

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో భారీవర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని ప్రతి కార్యాలయంలోను జనరేటర్ బ్యాకప్ ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. తహసీల్దార్, ఎంపీడీఓ, ఆర్డీఓ కార్యాలయాలలోను, కలెక్టరేట్‌లోను బ్యాకప్ జనరేటర్ ఉండాలన్నారు. వీటి పర్యవేక్షణ కోసం ఓ ప్రత్యేక ఇన్‌చార్జ్‌ను నియమించాలని ఆదేశించారు.

రేపు, ఎల్లుండి విద్యా సంస్థలకు సెలవు

ఈనెల 16, 17 తేదీలలో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అన్ని విద్యాసంస్థలకు సెలవులు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. వాతావరణం బాగుంటే సెలవులను రద్దు చేస్తామన్నారు. కలెక్టరేట్‌లోను, అన్నిమండల కేంద్రాలలోను ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈనెల16, 17 తేదీలలో పల్లెపండుగ కార్యక్రమాల విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడుకొని వాయిదా వేసుకోవాలని సూచించారు. జిల్లాలో ప్రమాదకరం గా ఉన్న బ్రిడ్జిలు, భవనాలను గుర్తించాలని అక్కడకు ఎవరిని వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లోతట్టుప్రాంతాలను గుర్తించి ఎక్కడా జనం ఇబ్బందులు పడకుండా, ఆస్తినష్టం జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఇరిగేషన్ ట్యాంకులను తహసీల్దార్, మైనర్‌ఇరిగేషన్‌శాఖ అధికారులు తనిఖీ చేయాలన్నారు. ఆట్యాంకుల వద్ద వీఆర్‌ఓ, వీఆర్‌ఏలను పర్యవేక్షణకు నియమించాలని ఆదేశించారు. వర్షాల గురించి ముందుగానే గ్రామాలలో దండోరా వేయించి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. సమావేశంలో జడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య, వ్యవసాయశాఖ జేడీ ఉమా మహేశ్వరమ్మ, సీపీఓ అశోక్‌కుమార్, ఎల్‌డీఎం నర్సింగరావు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ.బీ.దేవి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, వివిధశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉచిత డీఎస్సీ కోచింగ్‌కు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న డీఎస్సీ ఉచిత కోచింగ్‌లో సీటు కోసం అర్హులైన గిరిజన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి రామాంజనేయులు సోమవారం ఓ ప్రకటనలో కోరారు. అభ్యర్థులు జ్ఞానభూమి పోర్టల్ వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 21లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 22 నుంచి 25 వరకూ రాత పరీక్షకు సంబంధించి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ఈ నెల 27న అభ్యర్థులకు రాతపరీక్ష నిర్వహిస్తామన్నారు. వివరాలకు కార్యాలయ సిబ్బంది హిమసాగర్ సెల్ : 8309200704కు సంప్రదించాలన్నారు.

పోరాటయోధుడు సదాశివన్

- ఐదుకల్లుకు ఘన నివాళి



మాట్లాడుతున్న జాఫర్

అనంతపురం విద్య, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు ఐదుకల్లు సదాశివన్ గొప్ప పోరాటయోధుడని సీపీఐ నాయకులు పేర్కొన్నారు. ఆయన 36వ వర్ధంతిని సోమవారం సీపీఐ ఆఫీస్‌లో నగర కార్యదర్శి శ్రీరాములు అధ్యక్షతన నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, ఇతర నేతలు ముఖ్య అతిథులుగా హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాఫర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడిగా, హరిజనోద్యమ నాయకుడిగా, ప్రజాసేవకుడిగా, కమ్యూనిస్టుగా సదాశివన్ ఎంతగానో సేవలు అందించారన్నారు. జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో ఐదుకల్లు సేవలు చిరస్మరణీయం అన్నారు. శాసన మండలి సభ్యుడిగా పనిచేసినా సాదాసీదాగానే జీవించారన్నారు. ఆయన ఆశయాలను యువ కమ్యూనిస్టులు ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు లింగమయ్య, నగర సహాయ కార్యదర్శి రమణ, అల్లీపీరా, ఏఐవైఎఫ్ జల్లా ప్రధానకార్యదర్శి సంతోష్‌కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి కుళ్లాయిస్వామి తదితరులు పాల్గొన్నారు.

బస్సుయాత్రను జయప్రదం చేయండి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్



బస్సుయాత్ర పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం కల్చరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు సాగునీటి సాధన కోసం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి ఈనెల 20 వరకు చేపట్టనున్న బస్సు యాత్రను జయప్రదం చేయా లని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యలయంలో సోమవారం బస్సు యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ పాలకుల విధానాల వల్ల జిల్లా శతాబ్దాలుగా వెనుకబడి ఉందన్నారు. సాగునీటి వనరుల అభివృద్ధికి సరైన చర్యలు చేపట్టకుండా జిల్లాకు అన్ని ప్రభుత్వాలు అన్యాయం చేశాయని విమర్శించారు. ఎగువ తుంగభద్ర, దిగువ శ్రీశైలం డ్యాములు నిండి పొంగి పొర్లుతున్నా మన జిల్లాకు రావాల్సిన నీరు రాకపోవడం దారుణమన్నారు. ఈ పరిస్థితిపై ప్రజాభిప్రాయాన్ని పాలకుల దృష్టికి తీసుకెళ్లేందుకు బస్సుయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. వ్యవసాయం బతకాలంటే కనీసం 30శాతం భూమికి సాగునీటి వనరులు కల్పించాలని జాతీయ ఇరిగేషన్ కమిషన్ 1972లో సూచించిందన్నారు. జిల్లాలో నికరంగా 14.85లక్షల ఎకరాల సాగుభూమి ఉందని, ఇందులో స్థిరీకరించబడిన ఆయకట్టు 45,224 ఎకరాలు, అంటే మొత్తం సాగుభూమిలో 3.04శాతం భూమికి మాత్రమే నీటిపారుదల సౌకర్యం ఉందన్నారు. 14 సంవత్సరాల క్రితం ప్రారంభమైన హెచ్చెల్సీ ఆధునికీకరణ అంతులేని నిర్లక్ష్యానికి గురైందన్నారు. 2012 నుంచి హంద్రీనీవా నీరు జిల్లాకు వస్తున్నా ఇప్పటివరకూ పంట కాలువలు లేవన్నారు. సాగునీటి సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఈనెల 15 నుంచి 20వ తేదీ వరకు బస్సుయాత్ర, 21న కలెక్టరేట్ వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు, రైతాంగం పెద్దసంఖ్యలో పాల్గొని యాత్రను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సావిత్రి, బాలరంగయ్య, నాగేంద్రకుమార్, నల్లప్ప పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

సత్యసాయి సేవా సమితి ప్రారంభం



నగర సంకీర్తనలో సాయిభక్తులు

ధర్మవరం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక పీఆర్‌టీ సర్కిల్ సమీపంలోని సుబ్బదాసు సత్రంలో భగవాన్ సత్యసాయి బాబా సేవా సమితిని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యసాయి బాబాసేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు, జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ 45 సంవత్సరాలుగా సత్యసాయిబాబా భజనలతో పాటు అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ప్రతి నెలా 24 అన్నదానం, 19న మహిళా డే, ప్రతి రోజూ నగర సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

ఇది జేఎన్‌టీయూ టైమ్స్

- వర్సిటీకి అంతర్జాతీయ గుర్తింపు



అనంతపురం సెంట్రల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ అనంతపురానికి అంతర్జాతీయ గుర్తింపు లభించింది. టైమ్స్ హైయ్యర్ ఎడ్యుకేషన్(టి) నిర్వహించిన ప్రపంచ విశ్వవిద్యాలయాల ర్యాంకింగ్-2025లో జేఎన్‌టీయూకి 801-1000 ర్యాంక్ బ్యాండ్ దక్కింది. ఇండియాలోని వర్సిటీల్లో 23వ ర్యాంకు సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా వీసీ సుదర్శన రావు హర్షాన్ని వ్యక్తం చేస్తూ ర్యాంకింగ్ వివరాలను వెల్లడించారు. బోధన, పరిశోధన, పరిశ్రమల అనుసంధానం, అంతర్జాతీయ దృక్పథం తదితర అంశాలను పరిగణలోకి తీసుకున్న టి సంస్థ ప్రపంచ వ్యాప్తంగా ఉన్నత విద్యనందించే సంస్థలకు ర్యాంకులను ప్రకటించిందన్నారు. ఈ ర్యాంకుల్లో జేఎన్‌టీయూకి మెరుగైన చోటు దక్కడం హర్షణీమని తెలిపారు. వర్సిటీ అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది ప్రణాళికాబద్ధమైన కృషి ర్యాంకింగ్ రావడానికి దోహదపడిందన్నారు.

క్రీడా సర్టిఫికెట్ల పరిశీలన

- 150మందికి గాను 60మంది హాజరు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ మహిళా పోలీసు పోస్టులకు స్పోర్ట్స్ కోటాలో అభ్యర్థుల సర్టిఫికెట్లను సోమవారం పరిశీలించారు. 2019లో విడుదలైన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగ నోటిఫికేషన్‌లో మిగిలిన మహిళా పోలీస్ పోస్టులకు స్పోర్ట్స్ కోటా అభ్యర్థులను కోర్టు ఆదేశాలతో సర్టిఫికెట్ల పరిశీలనకు పిలిచారు. ఈ కార్యక్రమం స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్‌ఏ ఇండోర్‌స్టేడియంలో నిర్వహించారు. మహిళా పోలీసు పోస్టులు 24గాను 150మందికి కాల్ లెటర్‌లు పంపగా 60మంది మాత్రమే హాజరయ్యారు. ఎస్పీ ఆఫీస్ సూపరింటెండెంట్ నందకుమార్, ఇన్‌చార్జి డీఎస్‌డీఓ అనిల్‌కుమార్ నేతృత్వంలో అభ్యర్థుల నేషనల్, ఇంటర్నేషనల్, యూనివర్సిటీ, ఎస్‌జీఎఫ్, అసోసియేషన్‌ల, ఫెడరేషన్‌ల వారీగా క్రీడా సర్టిఫికెట్లను పరిశీలించారు. అభ్యర్థుల నుంచి ఆయా క్రీడా సర్టిపికెట్లు ఒక సెట్ తీసుకున్నారు. అనంతరం సర్టిఫికెట్లను ఆయా సంస్థలు, సంఘాల ద్వారా మరోసారి తనిఖీ చేసి తుది నిర్ణయం తీసుకుంటారు. కార్యక్రమంలో కోచ్‌లు, ఎస్పీ ఆఫీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కవితలకు ఆహ్వానం

అనంతపురం కల్చరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాయలసీమ 8వ మహాకవిసమ్మేళనానికి కవుల నుంచి కవితలను ఆహ్వానిస్తున్నట్లు కేంద్ర సాహిత్య అకాడమీ యువపురస్కార గ్రహీత అప్పిరెడ్డి హరినాథరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. విభిన్న రంగాల సీమ ప్రముఖులపై కవితలను రాసి, డిసెంబరు 8లోపు 9963917187 నెంబరుకు వాట్సాప్ ద్వారా పంపాలన్నారు.

కొనసాగిన పప్పుశనగ రిజిస్ట్రేషన్

అనంతపురం అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పప్పుశనగ విత్తనాల కోసం జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో రైతుల పేర్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ సోమవారం కొనసాగింది. ఇప్పటి దాకా 13,397 మంది రైతులు 18,808 క్వింటాళ్ల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ తెలిపారు.

టమోటా కిలో రూ.53

అనంతపురంరూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.53తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు సోమవారం 1050 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.40, కనిష్ఠ ధర రూ.30పలికినట్లు ఆయన తెలిపారు.


1.634 టీఎంసీల నీటి నిల్వ

బెళుగుప్ప, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.634 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు సోమవారం తెలిపారు. అలాగే ఇన్‌ఫ్లో 1148 క్యూసెక్కులు ఉండగా.. ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 1108 క్యూసెక్కులు వెళుతున్నట్లు వారు పేర్కొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రయిట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కౌంచ్...

షిర్డీసాయిబాబా (మహా సమాధి)



సాధువు, యోగి అయిన షిర్డీ సాయిబాబా 1835 సెప్టెంబరు 23న జన్మించారు. భక్తులకు శ్రద్ధ, సబూరి లక్షణాలను అలవరుచుకోవాలని సూచిం చారు. రెండు మతాలను అవలంబించి సహయోగము కుదర్చడానికి ప్రయత్నించారు. ముస్లింలు, హిందువులు కూడా ఆయనను సాధువుగా నమ్ముతారు. తాను నివసించిన మసీదును ద్వారకామాయి అని పేరు పెట్టారు. ఆయన బోధనలో ప్రేమ, కరుణ, దానం, సంతృప్తి, శాంతి, దైవారాధన, గురుపూజ ముఖ్యమైనవి. 'సబ్ కా మాలిక్ ఏక్ హై' అనే నినాదాన్ని చాటారు. భక్తులు ఆయనను శివుని, దత్తాత్రేయ అవతారంగా భావిస్తారు. 1918 అక్టోబరు 15న షిర్డీలో మహాసమాధి అయ్యారు.

దేవిప్రసాద్ రాయ్ చౌదరి (వర్ధంతి)



దేశంలో పేరొందిన ప్రముఖ చిత్రకారుడు, శిల్పి పద్మభూషణ్ గ్రహీత దేవిప్రసాద్ (డిపి)రాయ్ చౌదరి 1899 జూన్ 15న రంగపూర్‌లోని తేజ్‌హాత్‌లో (ప్రస్తుతం బంగ్లాదేశ్ పరిధిలో) జన్మించారు. చిత్రకళలో రాణించి దేశవ్యాప్తంగా కళాఖండాలను ప్రదర్శించారు. ప్రత్యేకించి మహాత్మాగాంధీ కాంస్య విగ్రహం, ఇతర ప్రముఖుల విగ్రహాల రూపకల్పనలో పేరొందారు. లలిత కళా అకాడమీ సంస్థాపక ఛైర్మన్ గా వ్యవహరించారు. ఆయన కళాఖండాలు పలు మ్యూజియంలలోనూ ప్రదర్శించబడ్డాయి. 1975 అక్టోబరు 15న కన్నుమూశారు.

డాక్టర్ అబ్దుల్ కలాం (జయంతి)



దేశం గర్వించదగిన ప్రము ఖులలో ఒకరైన 'భారతరత్న' గ్రహీత, దేశ 11వ రాష్ట్రపతిగా వ్యవహరించిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 1931 అక్టోబరు 15న రామేశ్వరంలో జన్మించారు. డిఆర్‌డీఓ, ఇస్రోలలో శాస్త్రవేత్తగా పలు హోదాలలో కొనసాగి బాలిస్టిక్ మిస్సైల్, లాంచ్ వెహికల్ సాంకేతికతలో ఆధునీకరణకు కృషి చేసి 'మిస్సైల్ మ్యాన్'గా గుర్తింపు పొందారు. పోఖ్రాన్ అణుపరీక్షల్లోనూ కీలకంగా వ్యవహరించారు. 2002 నుంచి 2007 వరకు రాష్ట్రపతిగా కొనసాగారు. పద్మ భూషణ్, పద్మవిభూషణ్, వీర్ సావర్కర్‌తోపాటు పలు గౌరవ డాక్టరేట్‌లు, ఇతర పురస్కారాలు పొందారు. 'కలలు కనండి సాకారం చేసుకునేందుకు శ్రమించండి' అని విద్యార్థులకు పిలుపునిచ్చారు. 2015 జూలై 27న కన్నుమూశారు.

కాటూరి వేంకటేశ్వరరావు (జయంతి)



రచయిత వేంకటేశ్వరరావు 1895 అక్టోబరు 15న కృష్ణా జిల్లా కాటూరిలో జన్మించారు. ఉపాధ్యాయుడిగా, కవిగా, సంపాదకుడిగా వ్యవహరించారు. ఉప్పు సత్యాగ్రహంలోనూ పాల్గొన్నారు. పింగళి లక్ష్మీకాంతంతో కలసి కొన్ని రచనలు చేశారు. గురువులైన తిరుపతి వేంకటకవుల మాదిరిగా జంటకవులుగా ఆధునిక సాహిత్యానికి కృషి చేశారు. సంస్కృతం నుంచి కొన్ని అనువాదం చేశారు. 1962 డిసెంబరు 25న కన్నుమూశారు.

ముడికొండన్ వెంకటరామ అయ్యర్ (జయంతి)



సంగీత కళానిధి గ్రహీత కర్ణాటక సంగీతకారుడు ముడికొండన్ వెంకటరామ అయ్యర్ 1897 అక్టోబరు 15న తమిళనాడు రాష్ట్రం తిరువారూర్ జిల్లాలో ముడికొండన్ ప్రాంతంలో జన్మించారు. రాగం, తాళం, పల్లవిలను క్రమంగా చెప్పడంలో దిట్ట. తెలుగు, తమిళ, సంస్కృతం, ఆంగ్ల భాషలలో ప్రావీణ్యులు. చెన్నైలోని టీచర్స్ కాలేజ్ ఆఫ్ మ్యూజిక్‌కు ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. సంగీత శిఖామణి తదితర పురస్కారాలు అందుకున్నారు. 1975 సెప్టెంబరు 13న కన్నుమూశారు.

శంకర్ (జయంతి)




సంగీతద్వయం 'శంకర్ - జైకిషన్'లలో ఆయన ఒకరైన 'పద్మశ్రీ' గ్రహీత శంకర్‌సింగ్ 1922 అక్టోబరు 15న హైదరాబాద్‌లో జన్మించారు. తబలా, సితార్, అకార్డియన్, పియానో తదితర సంగీతవాద్యాలను వాయించేవారు. 1949 నుంచి 1971వరకు ఇద్దరూ కలసి హిందీ సినీ రంగంలో సంగీతాన్ని సమకూర్చారు. 9సార్లు ఉత్తమ సంగీతదర్శకుల అవార్డు పొందారు. రాజ్ కపూర్ ఫిల్మ్స్‌కు హౌస్ కంపోజర్స్‌గా వ్యవహరించారు. ఇరువురూ 'పద్మశ్రీ' పొందారు. 1987 ఏప్రిల్ 26న శంకర్ కన్నుమూశారు.

వెంపటి చినసత్యం (జయంతి)



'పద్మభూషణ్' గ్రహీత వెంపటి చినసత్యం 1929 అక్టోబరు 15న కృష్ణా జిల్లా కూచిపూడి గ్రామంలో జన్మించారు. భరతనాట్యానికి దీటైన కూచిపూడి నృత్యానికి జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతిలో తెచ్చారు. 1963లో కూచిపూడి ఆర్ట్ అకాడమీని స్థాపించారు. కూచిపూడిలో నృత్యనాటికలను రూపొందించి దేశ విదేశాలలో ప్రదర్శించారు. 2011లో 2800 మంది కళాకారులతో ఏకకాలంలో నిర్వహించిన భరతనాట్య ప్రదర్శనకు గిన్నిస్ రికార్డు సాధించారు. కళాప్రపూర్ణ, కళాసాగర్, కళైమామణి, కాళిదాస సమ్మాన్ తదితర లెక్కకు మిక్కిలి పురస్కారాలు పొందారు. 2012 జూలై 29న కన్నుమూశారు.

ఎన్ రమణి (జయంతి)



వేణువాదకులు 'పద్మశ్రీ' గ్రహీత డాక్టర్ నటేశన్ రమణి 1934 అక్టోబరు 15న తమిళనాడు రాష్ట్రం తిరువారూర్ జిల్లాలో జన్మించారు. వేణువుపై కర్ణాటక సంగీతాన్ని సమకూర్చడం ప్రత్యేకత. ఆలిండియా రేడియోలో కచేరీలు నిర్వహించారు. జుగల్బందీలలోనూ రాణించారు. సంగీత కళానిధి, సంగీత నాటక అకాడమీ తదితర పురస్కారాలు పొందారు. 2015 అక్టోబరు 9న కన్నుమూశారు.

బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు

• హుబ్బళ్ళి కేసుల ఉపసంహరణపై ఆగ్రహం



ఫ్రీడంపార్కులో బీజేపీ నిరసన

బెంగళూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): హుబ్బళ్లిలో కొనసాగిన హింసాత్మక సంఘటన కేసులను రాష్ట్రప్రభుత్వం ఉపసంహరించుకోవడాన్ని నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టారు. బెంగళూరు ఫ్రీడంపార్కులో ప్రతిపక్ష నేతలు అశోక్, చలవాది నారాయణస్వామి ఆధ్వర్యంలో ఆందో ళన చేశారు. అనంతరం గవర్నర్‌ను కలసి వినతిపత్రాన్ని అందచేశారు. ప్రభుత్వాన్ని వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాం డ్ చేశారు. ప్రతిపక్షనేత అశోక్ మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం దారితప్పించేలాంటి విధానాలకు పాల్పడుతోం దన్నారు. హుబ్బళ్లిలో హింసాత్మక సంఘటనలపై ఎన్ఐఏ దర్యాప్తు చేస్తోందని, అటువంటి కేసును ప్రభుత్వం ఎలా రద్దు చేస్తుందని ప్రశ్నించారు. పోలీస్‌స్టేషన్‌కు నిప్పు పెట్టిన చర్యను సమర్థించడం ఎంతవరకు సమంజసమన్నారు. కోర్టులో కేసులు సాగుతున్న వాటిపట్ల కనీసం మాట్లాడకూడదనే నిబంధనలు ఉంటే ప్రభుత్వం ఏకంగా వాటిని రద్దు చేసే నిర్ణయం తీసు కుందన్నారు. ఒక సామాజికవర్గానికి మేలు చేసేందుకు వ్యవ స్థపై దాడి చేస్తున్నారన్నారు. పార్టీ అధ్యక్షుడు విజయేంద్ర మా ట్లాడుతూ సీఎం సిద్దరామయ్య రాజీనామా అనివార్యమని అందుకే ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ద్వారా ఐదేళ్లు సిద్దరామయ్య ముఖ్యమంత్రిగా ఉంటారని చెప్పించగలరా అంటూ సవాల్ విసిరారు. సిద్దరామయ్య పాపాల పుట్ట నిండిందన్నారు. దళితులకు కేటాయించిన గ్రాంట్లను ఇతర పథకాలకు కేటాయించారని అన్నారు. అభివృద్ధి స్తంభించిందని, గ్యారెంటీలతో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని సీఎం ఆర్థిక సలహాదారుడు బసవరాజ రాయరెడ్డి వెల్లడించారన్నారు. ఇదే అభిప్రాయాన్ని సీనియర్ నేత ఆర్‌వీ దేశ్‌పాండే తెలిపారన్నారు. ఇక మరో సీనియర్ ఎమ్మెల్యే రాజుకాగె అభివృద్ధి చేయలేనని, రాజీనామా చేస్తానని సవాల్ విసిరిన విషయం తెలిసిందే నన్నారు. ప్రభుత్వానికి, సీఎం సిద్దరామయ్యకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిరసనలో మాజీ డీసీఎం అశ్వత్థనారాయణ, శాసనసభ్యుడు సీటీ రవి, ఎస్ఆర్ విశ్వనాథ్, సీకే రామమూర్తి, రవికుమార్, మాజీ ఎమ్మెల్సీ మహంతేశ్ కవటిగమఠ, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.



గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

ఉద్యోగుల సంఘ ఎన్నికలకు నామినేషన్లు



బంగారపేటలో నామినేషన్‌లు సమర్పిస్తున్న పలువురు

బంగారపేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం 2024-29 అవధికి తాలూకా శాఖ డైరెక్టర్‌లు, పదాధికారుల ఎన్నికలకు నామినేషన్ ప్రక్రియ ఆరంభమైంది. ప్రాథమిక విద్యాశాఖ నుంచి సి అప్పయ్యగౌడ, కాంతరాజ్, నారాయణస్వామి, రుక్మిణియమ్మ, శ్రీనివాస్, శ్యామూర్తి, నాగరాజప్ప, అటవీశాఖ నుంచి సంతోష్, పీయూ విద్యాశాఖ నుంచి బోడిరెడ్డి, మొత్తం 9మంది అభ్యర్థులు నామినేషన్లు సమర్పించినట్టు ఎన్నికల అధికారి మంజునాథ్ వెల్లడించారు. పట్టణంలోని బీఆర్‌సీ కార్యాలయంలో నామినేషన్లు సమర్పించారు. ఈనెల 18వరకు అవకాశం ఉంది. 19న నామినేషన్ల పరిశీలన ఉదయం 10గంటలకు అర్హులన అభ్యర్థుల పేర్లను ప్రకటించనున్నారు. కాగా ఈనెల 21న సాయంత్రం 4.30వరకు నామినేషన్ల ఉపసంహ రణకు అవకాశం ఉండగా, ఎన్ని కల బరిలో అంతిమ అభ్యర్థులు తేలనున్నారు. ఈనెల 28న ఉదయం 9 గంటలనుంచి సాయంత్రం 4వరకు బీఆర్‌సీ కార్యాలయంలో పోలింగ్ ఉంటుంది. అనంతరం ఫలితాలు ప్రకటించ నున్నారు.



శిడ్లఘట్టలో నామినేషన్ల సమర్పణ

శిడ్లఘట్టలో...

శిడ్లఘట్ట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘా నికి 2024-29 అవధికి తాలూకా, యోజనా శాఖ డైరెక్టర్‌ల స్థానాలకు ఎన్నికల ప్రక్రియ జోరందుకుంది. వివిధ శాఖల ఉద్యోగుల సంఘాలను మొత్తం 23 విభాగాలుగా విభజించారు. తాలూకాలో 33 స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. సుమారు 1166మంది ఓటర్లు ఉన్నారు. ఈనెల 18న సాయంత్రం 5వరకు నామినేషన్లు సమర్పించే అవకావం ఉందని ఎన్నికల అధికారి బైరారెడ్డి తెలిపారు. 19న నామినేషన్ల పరిశీలన, 21న ఉపసంహరణ అనంతరం అంతిమ అభ్యర్థులు తేలనున్నారు. 28న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4వరకు పోలింగ్, అనంతరం ఓట్ల లెక్కింపు, ఫలితాలు ప్రకటిస్తారన్నారు. తాలూకా హైస్కూల్ స్కూల్ అసిస్టెంట్‌ల సంఘం అధ్యక్షుడు వెంకతరెడ్డి, ప్రధాన కార్యదర్శి రుద్రేశమూర్తి తదితరులు మాట్లాడుతూ ఇదివరకు సుబ్బారెడ్డి ఉత్తమ సేవలందించారని అభిప్రాయపడ్డారు.

యువతతోనే సమాజంలో మార్పు



ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

విజయపుర, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): యువతతోనే సమాజంలో మార్పు సాధ్యమని ప్రాంతీయ కార్యనిర్వాహక జయప్రకాశ్ అభిప్రాయపడ్డారు. దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలోని ప్రభుత్వ పీయూ కళాశాల మైదానంలో దేవనహళ్ళి తాలూకా ఆర్ఎస్ఎస్ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటైన స్వయంసేవక్ సంఘాల కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. మన సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించేలా యువత కృషి చేయాలన్నారు. ఈ దిశగా యువతలో చైతన్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమానికి ప్రగతి విద్యాసంస్థల అధ్యక్షుడు ఎం సతీశ్‌కుమార్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ మహారాష్ట్రలోని నాగపూర్‌లో హెగ్డేవార్ నేతృత్వంలో స్థాపించబడిన ఆర్ఎస్ఎస్ వందో సంవత్సరంలోకి అడుగు పెట్టిందన్నారు. యువతలో దేశభక్తి, శ్రద్ధ, క్రమశిక్షణ కల్పించడంలో ఆర్ఎస్ఎస్ ఇతోధికంగా కృషి చేస్తోందన్నారు. అంతకుముందు హెగ్డేవార్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

దుస్తుల ఎంపికలో నాణ్యత పరిశీలించాలి

బెంగళూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దుస్తుల ఎంపికలో నాణ్యతను పరిశీలించాలని ఎవరికైనా సౌకర్యం ముఖ్యమని బిగ్‌హాలో మార్కెటింగ్ హెడ్ మోదతా త్రిపాఠి అభిప్రాయపడ్డారు. ఎలక్ట్రానిక్ సిటీలో సోమవారం బిగ్‌హాలో షోరూంను లాంచనంగా ఆరంభించారు. ప్లస్ సైజ్ వ్యక్తులకు ప్రత్యేకమైన బ్రాండ్‌లు మా ప్రత్యేకత అన్నారు. ఇప్పటివరకు 18 షోరూంలు ఉన్నాయని వీటిలో బెంగళూరులోనే ఎనిమిదో షోరూం తెరిచామన్నారు. ఐటీ సిటీగా పేరొందిన బెంగళూరులో అన్ని రాష్ట్రాలు, దేశాలకు చెందిన ప్రజలు నివసిస్తున్నారని వారికి అనుకూలంగా ఉండాలనే బ్రాండ్‌లను అందుబాటులోకి తెచ్చామన్నారు.

కాలువలను పట్టించుకోండి



పాలడెయిరీ పక్కనే మురుగుకాలువ

చేళూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని సోమ నాథపురం పాలకేంద్రం వద్ద మురుగు కాలువలలో పూడికతీయకపోవడంతో దుర్గంధం నెలకొంది. హోబళి కార్యాలయానికి సమీపంలోనే పాల డెయిరీ కేంద్రం ఉంది. కార్యాలయానికి, పాల డెయిరీకి నిత్యం పెద్ద సంఖ్యలో ప్రజలు వస్తుంటారు. ఇటువంటి కీలక ప్రదేశాలలోనూ స్వచ్ఛత పాటించకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా కాలువలను శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రతి ఇంటా ఆధ్యాత్మికత పెరగాలి

జయేంద్రపురి మహాస్వామిజీ



పుస్తకావిష్కరణలో స్వామిజీ, డాక్టర్ వెంకటరమణ తదితరులు

బెంగళూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటా ఆధ్యాత్మికత పెరగాలని అందుకు అనుగుణంగా పిల్లలకు స్తోత్రాలు, వచనాలు పలికించే ప్రక్రియ కొనసాగాలని రాజరాజేశ్వరి ఆలయ కైలాశ ఆశ్రమ మహాసంస్థాన మఠాధిపతి జయేంద్రపురి మహాస్వామిజీ అభిప్రాయపడ్డారు. రాజరాజేశ్వరి నగర్‌లోని మహాసంస్థానంలో స్తోత్ర సంగ్రమ పుస్తకాన్ని ఆదివారం రాత్రి లాంఛ నంగా విడుదల చేశారు. ప్రముఖ సంస్కృత నిపుణుడు, విద్యావాచస్పతి వ్యాసాం కెరె ప్రభంజనాచార్య ముఖ్యులుగా పాల్గొన్నారు. కర్ణాటక బ్రాహ్మణ అభివృద్ధి మండలి ఛైర్మన్ అసగోడు జయసింహతోపాటు బ్రెయిన్స్ ఆసుపత్రి ఫౌండర్ ఛైర్మన్ డాక్టర్ ఎన్‌కే వెంకటరమణ పాల్గొన్నారు. స్వామిజీ మాట్లాడుతూ స్తోత్రాల పఠనం ఒకప్పుడు ప్రతి ఇంటా సాగేదని, ఆ విధానం పునరావృతం కావా లని ఆకాంక్షించారు. రచయిత్రి శోభా వెంకట్, పరిశోధకులు డాక్టర్ కృష్ణా కొల్హార్ కులకర్ణి, సంపాదకులు ఎన్ భారతి పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యం కూడా ముఖ్యమే



ప్లకార్డులతో విద్యార్థులు

దొమ్మసంద్ర, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికి శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఆరోగ్యం కూడా ముఖ్యమేనని ట్రీడా సంస్థ వ్యవ స్థాపకులు డాక్టర్ జి లింగరాజు అభిప్రాయపడ్డారు. తాలూకాలోని హుస్కూరు గ్రామంలో ట్రీడా సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక వీధినాటక కార్యక్రమానికి శ్రీకారం చుట్టి మాట్లాడారు. ఆధునిక జీవనశైలిలో కుటుంబ సమస్యలు, ఇతరత్రా ఒత్తిడితో ప్రతిరోజూ మానసిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. దేశంలో సుమారు 90శాతం ఆత్మహత్యలకు మానసిక వైకల్యమే కారణమని నిపుణుల అభిప్రాయంగా ఉందన్నారు. సత్సంగం, ధ్యానం, యోగా, వ్యాయామం వంటి వాటిని జీవనంలో భాగం చేసుకోవడం ద్వారా మానసిక స్థైర్యం సాధ్యమన్నారు. ట్రీడా సంస్థకు చెందినవారు, ఎస్‌జెఇఎస్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పద్మావతి కళానికేతన్ ఆధ్వర్యంలో

అలరించిన సాంస్కృతిక ఉత్సవం



సాంస్కృతిక ఉత్సవంలో చిన్నారులు, కళాకారులు

బెంగళూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పద్మావతి కళానికేతన్ ఆధ్వర్యంలో దసరాను పురస్కరించుకుని నిరంతరంగా సాంస్కృతిక ఉత్సవాలు కొనసాగించారు. నగరంలో జరిగిన కార్యక్రమంలో కళానికేతన్ వ్యవస్థాపకులు వేణుగోపాల్, విజయ వేణుగోపాల్, విజయ నాయుడు ఉత్సవాలను ప్రారంభించారు. ప్రతిరోజూ నృత్య, సంగీత, భజన, వీణావాదన కార్యక్రమాలు కొనసాగాయి. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ 44ఏళ్లుగా దసరా వేళ 9రోజులపాటు సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగిస్తున్నామన్నారు. సురభి, శాలిని, సుష్మా శ్రీధర్‌ల శిష్యులు నృత్య ప్రదర్శనలు చేశారన్నారు.

భవనంపై నుంచి పడి కార్మికుడి మృతి



ఘటనాస్థలంలో గుమిగూడిన స్థానికులు

బంగారపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాష్ట్ర గోడౌన్‌ల మండలి అనుబంధసంస్థ ఆవరణలో కార్మికుడు ఒకడు భవనంపై నుంచి పడి మృతి చెందాడు. నారాయణస్వామి (35) మృతుడిగా గుర్తించారు. కెజిఎఫ్ తాలూకాలోని ఘట్టమాదమంగల గ్రామానికి చెందిన వ్యక్తిగా తెలుస్తోంది. సోమవారం తెల్లవారు జామున పనులకోసం పట్టణంలోని గోడౌన్ సెంటర్‌కు వచ్చాడు. గోడౌన్ సెంటర్ భవనంపై షీట్‌లు మార్పు చేసే సమయంలో అదుపు తప్పి కిందపడ్డాడు. తీవ్రమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గోడౌన్ మేనేజర్ కుమార్ ఘటనాస్థలాన్ని పరి శీలించి బాధిత కుటుంబానికి రూ.5లక్షల పరిహారం ఇవ్వనున్నట్టు తెలిపారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి శ్రీకారం



భూమిపూజలో ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి తదితరులు

మహదేవపుర, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఎమ్మెల్యే మంజుళా లింబావళి శంకుస్థాపన చేశారు. మిట్టగానహళ్ళి, హోసూరు బండె, కాడుసొణ్ణప్పనహళ్ళి, బండె హోసూరు, కణ్ణూరు, చిక్కగుబ్బి, దొడ్డగుబ్బి, అణగలపుర, బండె బొమ్మసంద్ర, నాడగౌడ గొల్లహళ్ళి, యర్రప్పనహళ్ళి, కాడు అగ్రహార గ్రామాలలో రోడ్డు, డ్రైనేజీ, జలజీవన్ మిషన్, క్రీడా మైదానం, బోరుబావి, రాజకాలువ, వర్షపునీరు కాలువకు కల్వర్టు తదితర నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. నిర్ణీత గడువులోగా నిర్మాణాలు పూర్తి చేయాలని, నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా గ్రామీణ విభాగం బీజేపీ అధ్యక్షుడు నటరాజ్, ప్రముఖులు అశోక్, బిదరహళ్ళి రాజేశ్, రమేశ్, బండెబొమ్మసంద్ర మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎంలో చోరీకి యత్నం

నార్పల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బ్రిడ్జి వద్ద ఉన్న ఏటీఎంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి యత్నించారు. సెక్యూరిటీ లేకపోవడాన్ని గుర్తించిన దుండగులు ఏటీఎం లోపలి భాగంలో ఉన్న బాక్స్‌ను పగలగొట్టారు. ఎంత ప్రయత్నించినా లోపల ఉన్న చిన్న బాక్స్ రాకపోవడంతో వారు చోరీ యత్నాన్ని విరమించుకున్నారు. ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ సాగర్ సంఘటన స్థలానికి చేరుకొని క్లూస్ టీంను పిలపించి వేలిముద్రలు సేకరించారు. స్టేట్ బ్యాంక్‌కు వెళ్లి సీసీ కెమెరాలు పరిశీలించారు. ఏటీఎంలో ఎంత నగదు ఉందని బ్యాంకు సిబ్బందిని ప్రశ్నించారు. ఏటీఎంలో రూ.35వేలు మాత్రమే ఉందని, ఎలాంటి నగదు పోలేదని బ్యాంక్ అధికారులు వెల్లడించారు. ఇది దొంగల పనికాదని, ఆకతాయిల పనేనని, సీసీ కెమెరాలు పరిశీలించామని, నిందితులను పట్టుకుంటామని సీఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు.

3 నుంచి ప్రభుత్వ ఉద్యోగుల క్రికెట్ టోర్నీ

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా స్థాయిలో ప్రభుత్వ ఉద్యోగుల క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నట్లు ఏపీ వెటరన్ క్రికెట్ అసోసియేషన్, ఏపీ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ట్రస్టు అధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి తెలిపారు. ఆర్డీటీ స్టేడియంలో నవంబరు 3 నుంచి టోర్నీ ఉంటుందన్నారు.

రిటైర్డు ఉద్యోగి మృతికి సంతాపం



శివప్ప (ఫైల్)

బాగేపల్లి, అక్టోబరు 14(ఆంధ్ర జ్యోతి): బిఎస్ఎన్ఎల్ రిటైర్డు ఉద్యోగి శివప్ప (75) మృతిపట్ల ఎమ్మెల్యే సుబ్బారెడ్డి సహా పలువురు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అనారోగ్యంతో కొంతకాలంగా ఇబ్బంది పడు తున్న శివప్ప ఆదివారం కన్ను మూశారు. సోమవారం ఉదయం స్వగ్రామం పోతే పల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు. వివిధ సంఘాల ప్రము ఖులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

ప్రవాహం తగ్గింది.. ప్రయాణం మొదలైంది..

● కంప్లి కోటె వంతెనపై మళ్లీ వాహనాల రాకపోకలు

కంప్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : తుంగభద్ర జలాశయం నుంచి నదికి వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. దీంతో కంప్లి కోట వంతెన వద్ద ప్రయాణం మళ్లీ మొదలయ్యింది. ఇటీవల వారం రోజులుగా కంప్లి కోట వద్ద వంతెనను తాకుతూ నీరు ప్రవహించిది. కంప్లి, గంగావతి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. అయితే ఆదివారం నుంచి నీరు తగ్గుముఖం పట్టడంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా వాహనాలు ప్రయాణం సాగిస్తున్నాయి. సన్నాపురం, బెళగోడుహాళ్, ఇటిగి నదికి నీరు పోటెత్తడంతో మోటార్లు ధ్వంసమవుతాయని మోటార్లను ఒడ్డుకు చేర్చారు. వరదనీటి ప్రవాహం రావడంతో కొద్ది వరకు రైతన్నలు మోటార్ల ద్వారా నీరు మళ్లించే రైతన్నలకు కూడా ఆటంకం ఏర్పడిందన్నారు. మొత్తం మీద తుంగభద్రలో నీటి ప్రవాహం తగ్గుతుండటంతో రైతులు, ప్రయాణికులు మళ్లీ వాహనాల రద్దీ జోరందుకుంది.

వంతెనపై మొదలైన వాహనాల రాకపోకలు



వాల్మీకి నిగమ నిధుల దుర్వినియోగంపై

సీఎం స్పందించాలి

● ఎమ్మెల్సీ వైఎం సతీశ్



బళ్లారి సిటీ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సిద్దరామయ్య సండూరు పట్టణానికి రావడం ఉప ఎన్నికల జిమ్మిక్కు అని, వాల్మీకి నిగమ నిధుల దుర్వినియోగంపై సీఎం స్పందించాలని ఎమ్మెల్సీ వై.ఎం.సతీశ్ పేర్కొన్నారు. సండూరు ప్రజలు ఈసారి ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతారన్నారు. అక్రమాలు పెరగడంతో ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తిరస్కారం తప్పదన్నారు. వాల్మీకి నిమగ మండలిలో జరిగిన నిదుల దుర్వినియోగం గురించి సీఎం స్పష్టం చేయాలన్నారు. ప్రభుత్వంలో నిధుల కొరత ఉందని, ఇలాంటి సమయంలో భూమిపూజ, శంకుస్థాపన సాధనా సమావేశం ఎన్నికల జిమ్మిక్కేనన్నారు. రాష్ట్రంలో పలు పథకాలు లబ్ధిదారులకు చేరడం లేదన్నారు. నెట్‌వర్క్ , ఆధార్ లింక్ అనే కారణాలతో లబ్ధిదారులకు న్యాయం జరగడం లేదన్నారు. బళ్లారి జిల్లాలో 85,410 వితంతువులు, సంధ్యాసురక్షలో 53.364, వృద్ధాప్య పింఛన్లు 1,02.701 లబ్ధిదారులున్నారు. 34,244 దివ్యాంగులు, ఇతరులు 2,998 మంది మొత్తం 2,78,225 మంది లబ్ధిదారులున్నారు. వీరందరికీ పథకాలు సరిగా అందడం లేదన్నారు. వీటిపై సీఎం స్పష్టత ఇవ్వాలన్నారు.



రైతులను స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

సీఎంను అడ్డుకోవడానికి రైతుల యత్నం

● అరెస్ట్ చేసిన పోలీసులు

బళ్లారి గాంధీనగర్/కంప్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): సండూరు సభకు వెళ్తున్న ముఖ్యమంత్రిని అడ్డుకోవాలని చూసిన నిరసనకారులను పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం నారిహళ్ళి జలాశయానికి ముఖ్యమంత్రి సిద్దరామయ్య వాయనం సమర్పించేదుకు వెళ్తుండగా బన్నిహట్టి క్రాస్ వద్ద భూబాధితులు ఆందోళను సిద్ధమయ్యారు. జింధాల్ ఎయిర్ పోర్టు నుంచి సండూరుకు వెళ్ళే మార్గంలో బగర్‌హుకం క్రింద ఇనాం భూముల్లో సాగు చేస్తున్న వారికి హక్కు పత్రాలు ఇవ్వాలని, జిందాల్‌కు ఇచ్చిన 3,667 ఎకరాల భూమిని రద్దు చేయాలని, కుడితిని భూ బాధితులకు వెంటనే పరిహారం ఇవ్వాలని, లేదంటే భూములు వెనక్కి ఇవ్వాలని డిమాండ్లతో భూ బాధితులు ఆందోళన చేపట్టారు. ఈ విషయంపై ముఖ్యమంత్రికి మనవి పత్రం అందజేయాలని ఉద్దేశంతో నిరసన చేపట్టే ప్రయత్నంలో వారిని అరెస్ట్ చేశారు. అన్నదాతను స్టేషన్‌కు తరలించారు.

బీజేపీకి పూర్వవైభవమే లక్ష్యం

● ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న గాలి జనార్దన్‌రెడ్డి

బళ్లారి సిటీ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రెడ్డిసోదరులైన మనల్ని చీలిక తెచ్చే శక్తుల ప్రయత్నాలు ఫలించవు, జిల్లాలో మరోసారి బీజేపీకి పూర్వ వైభవం తీసుకురావడమే మా ప్రధాన లక్ష్యమని, అందుకు మీ సహకారం అవసరమని గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దనరెడ్డి అభిప్రాయపడ్డారు. సోమవారం నగరంలోని జిల్లాకార్యాలయంలో బీజేపీ క్రియాశీల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెడ్డిసోదరులు ఎప్పుడు ఒకటేనని మా మధ్యన చీలిక తెచ్చే శక్తుల ప్రయత్నాలు సాగవన్నారు. ఎన్నికల వేళ పార్టీల పరంగా వాగ్వాదం తప్పదని, ఇప్పుడు కలిసికట్టుగా బీజేపీకి పూర్వ వైభవం తీసుకువస్తామన్నారు. ఈసమావేశంలో బీజేపీ జిల్లాధ్యక్షుడు అనిల్‌నాయుడు, నాయకులు డాక్టర్ మహిపాల్, ఎస్.గురులింగడనగౌడ, గోనాల్ రాజశేఖర్‌గౌడ, హెచ్.హనుమంతప్ప, ఓబులేశ్, మాజీ మేయర్ వెంకటరమణ, బుడా మాజీ అధ్యక్షుడు దమ్మూరు శేఖర్, మారుతీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



బస్సుల కోసం వేచివున్న ప్రయాణికులు

సీఎం రాకతో ప్రయాణికులకు ఇబ్బందులు

కంప్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : సండూరులో ముఖ్యమంత్రి సిద్దరామయ్య పర్యటన కారణంగా బస్సులు లేక ప్రయాణికులు బస్సులు లేక ఇబ్బంది పడ్డారు. జిల్లాలోని సండూరు, కంప్లి, కురుగోడు, సిరుగుప్ప ఇతర పట్టణాల నుంచి 200లకు పైగా బస్సులను సీఎం పర్యటకు వినియోగించారు. దీంతో దసరా సెలవు ముగించుకుని ఊళ్లకు బయల్దేరిన ప్రయాణికులు బస్సులు లేక ఇబ్బంది పడ్డారు. ఉద్యోగులు గంటల కొద్దీ బస్టాండ్‌లో వేచి ఉండాల్సి వచ్చింది. అరకొర బస్సులు వచ్చినా అందులో స్థలం దొరక్క నెట్టుకుంటూ ప్రయాణించాల్సి వచ్చింది. ఈ సందర్భంగా పలువురు ప్రయాణికులు ప్రజలను ఇబ్బంది పెట్టి పర్యటనలు నిర్వహించడం ఏంటంటూ మండిపడ్డారు. కంప్లి పట్టణంలో ఇటు బళ్లారి, హోస్పేట, కురుగోడు పట్టణాలకు వెళ్ల ప్రయాణికులు, ఉద్యోగులు వాల్మీకి సర్కిల్‌లో గంటల కొద్దీ వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.

పుట్‌బోర్డుపై ప్రయాణిస్తున్న విద్యార్థులు



కన్నడ సాహిత్యానికి కారంతా కృషి అపారం

● టీచర్స్ ఫోరం జిల్లా యూనిట్ అధ్యక్షుడు రవిచెళ్లగుర్కి

బళ్లారి సిటీ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కన్నడ సాహిత్యరంగానికి విశిష్ట కృషి చేసిన కవుల్లో కారంతా ఒకరు అని కర్ణాటక రాష్ట్ర యాక్టివ్ టీచర్స్ ఫోరం బళ్లారి జిల్లా యూనిట్ అధ్యక్షుడు రవిచెళ్లగుర్కి పేర్కొన్నారు. తాలూకాలోని సంజీవరాయనకోట ప్రభుత్వ పాఠశాలలో సోమవారం కారంత జీవిత విశేషాల పరిచయ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కన్నడ సాహిత్యానికి కవి కారాంత విశిష్ట సేవలందించారన్నారు. ఆయన రచించిన 'మూకజ్జయ్య' నవలకు జ్ఞానపీఠ అవార్డు లభించిందన్నారు. అతను కన్నడ సాహిత్యంలోని అన్నిశైలుల్లో రచనలకు గాను శాస్త్రీయ కవి అని పిలుస్తారని కొనియాడారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా గాంధీజీకి నిజమైన అనుచరుడు కారంత దేశభక్తికి సాహిత్యసేవకు కృషి చేశారన్నారు. ఈసందర్భంగా గ్రామపంచాయితీ ఉపాధ్యక్షురాలు బసమ్మ హొన్నూర్‌స్వామి, ఉపాధ్యాయులు రామాంజనేయులు, గురుప్రసాద్, విజయ ముంద్రగి, ఆశా వర్కర్లు యశోద, సుశీల, విద్యార్థి ప్రతినిధులు సంతోష్, లక్ష్మీకాంత తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారుభిస్తున్న పంచాయతీ ఉపాధ్యక్షురాలు బసమ్మ

రహదారికి మరమ్మతులు ఎప్పుడో..?

సిరుగుప్ప, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌హెచ్ 19 రహదారికి మోక్ష మెన్నడోనని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిరుగుప్ప తాలుకాలో టెక్కలకోట మారెమ్మ ఆలయం నుంచి దడేసూగూరు గ్రామం వరకు 11 కిలోమీటర్లు రహదారి పనుల కోసం రూ. 118 కోట్లు నిధులు ప్రభుత్వం విడుదల చేసింది. ఈ పనులు ప్రారంభించి రెండేళ్లవుతున్నా ఇంతవరకు కిలోమీటర్ పనులు కూడా పూర్తి కాలేదు. హైవే అధికారులు ఈ పనులపై శ్రద్ధ చూపకపోవడం గమనార్హం. హైదరాబాద్‌కు చెందిన కాంట్రాక్టర్ ఈ పనులను మందకొడిగా సాగించడంపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రెండేళ్లలో ఎన్నో రోడ్డు ప్రమాదాలు సంభవించి ఎందరో ప్రాణాలు కోల్పోవడం, తీవ్రంగా గాయపడటం జరిగింది. ఇంత జరుగుతున్నా హైవే అధికారులు, కాంట్రాక్టర్లు హైవే పనులను పూర్తి చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. జిల్లా అధికారులు సంబంధిత కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేసినా చలనం లేకపోవడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



రహదారిపై నిలిచిన వర్షపునీరు

ఉచ్చీరప్ప ఆలయంలో పూజలు

సిరుగుప్ప, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఉచ్చీరప్ప తాత ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని ఆదోని రోడ్డు మార్గంలో 24వ వార్డులో వెలసిన ఉచ్చీరప్ప తాత ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ప్రధాన అర్చకులు ఉచ్చీరప్ప స్వాముల వారికి పుష్పాలంకార సేవలు నిర్వహించారు. భక్తులు భజన కార్యక్రమాన్ని చేపట్టారు. దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద పంపిణీ చేశారు.



భజనలు నిర్వహిస్తున్న భక్తులు

శ్రీకారం

● సాగునీటి సంఘాల బలోపేతానికి చర్యలు

● ఎన్నికల నిర్వహణకు సిద్ధం

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈక్రమంలోనే వాటి ఎన్నికల నిర్వహణకు శ్రీకారం చుట్టింది. వైసీపీ ఐదేళ్ల పాలనలో సాగునీటి సంఘాలు పూర్తిగా నిర్వీర్యమైపోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హెచ్చెల్సీ పరిధిలో 99, మైనర్ ఇరిగేషన్ పరిధిలో 95 మొత్తం 194సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఈనెల 16 నుంచి నవంబరు 24లోపు ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాల పరిధిలోని ఆయా ప్రాజెక్టులు, ఆయా డిస్ట్రిబ్యూటరీల పరిధిలో సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సమాయత్తమైంది. సాగునీటి సంఘాల ఏర్పాటుతో ఆయకట్టు రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు అవకాశం ఉంటుంది.

హెచ్చెల్సీ పరిధిలో 99 సాగునీటి సంఘాలు

తుంగభద్ర ప్రాజెక్టు ఎగువ కాలువ (టీబీపీ హెచ్చెల్సీ) పరిధిలో 99సాగునీటి సంఘాలను గుర్తించారు. వీటి పరిధిలో 2,70,809 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇందులో హెచ్‌ఎల్‌ఎంసీ 11 సాగునీటి సంఘాల పరిధిలో 35,541 ఎకరాల ఆయకట్టు ఉంది. మిడ్‌పెన్నార్ నార్త్ కెనాల్ 5 సంఘాలకు 13,325 ఎకరాలు, మిడ్ పెన్నార్ సౌత్ కెనాల్‌కు 10 సంఘాలకు 29,577ఎకరాల ఆయకట్టు ఉంది. తాడిపత్రి బ్రాంచ్ కెనాల్ కింద 25,478ఎకరాల ఆయకట్టుకు 9 సంఘాలు ఉన్నాయి. గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ పరిధిలో 11సంఘాల కింద 32,072 ఎకరాలు, కర్నూలు జిల్లాలోని ఆలూరు బ్రాంచ్ కెనాల్ 14,255 ఎకరాల ఆయకట్టుకు 6 సంఘాలు ఉన్నాయి. కడప జిల్లాలోని జమ్ములమడుగు 10సంఘాలకు 22,625ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రొద్దుటూరు 10 సంఘాలకు 24,524ఎకరాలు ఉంది. ఎర్రగుంట్ల 9సంఘాలకు 23,392 ఎకరాలు, కసనూరు 5 సంఘాలకు 8,843ఎకరాలు, సింహాద్రిపురం 8 సంఘాలకు 24,670ఎకరాలు, అచ్చవల్లి 5 సంఘాలకు 16,507ఎకరాల ఆయకట్టు ఉంది. మొత్తంగా అనంతపురం జిల్లాలో 5డిస్ట్రిబ్యూటరీ సంఘాల పరిధిలో 46సాగునీటి సంఘాలు, కర్నూలు ఒక డిస్ట్రిబ్యూటరీ కింద 6 సాగునీటి సంఘాలు, కడపలో 6 డిస్ట్రిబ్యూటరీల కింద 47సాగునీటి సంఘాలు ఉన్నాయి. మొత్తం హెచ్చెల్సీ పరిధిలో 12 డిస్ట్రిబ్యూటరీల కింద 99 సాగునీటి సంఘాలను గుర్తించారు.

మైనర్ ఇరిగేషన్ పరిధిలో 95...

మైనర్ ఇరిగేషన్ పరిధిలో జిల్లాలో 95 సాగునీటి సంఘాలు ఉన్నాయి. వీటిలో మేజర్ ప్రాజెక్ట్‌గా భైరవానితిప్ప (బీటీపీ) ప్రాజెక్టు కింద 6, చెరువులు 89 మొత్తం 95సాగునీటి సంఘాలు ఉన్నాయి. ఒక్కో అసోసియేషన్‌కు 20-50 ఎకరాల ఆయకట్టు రైతులు ఓటర్లుగా టీసీ(టెరిటోరియల్ కానిస్టిట్యూయన్సీ) ని ఎన్నుకుంటారు. టీసీలు కనీసం 6-12 మంది కలిసి వాటర్ యూజర్ అసోసియేషన్‌లో ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌లను ఎన్నుకుంటారు. సాగునీటి సంఘాలు కలిసి ప్రాజెక్టు అసోసియేషన్‌ను ఎన్నుకుంటారు. ఈ ప్రక్రియ మొత్తం ఈనెల 16 నుంచి నవంబరు 24లోపు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.



హోసూరు జోన్

పూల ధరలకు రెక్కలు

హోసూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): హోసూరు నగర చుట్టుపక్కల ప్రాంతాలైన బాగలూరు, బేరికై, కెలమంగలం, ఉద్దన్నపల్లి తదితర ప్రాంతాలలో పూలసాగు అధికంగా ఉంది. హోసూరు మార్కెట్‌కు భారీ ప్రమాణంలో పూలు వస్తున్నాయి. ప్రత్యేకించి చామంతి, చెండుమల్లి, పన్నీరు, గులాబీ, బటన్‌రోజా పూల సాగు అధికంగా ఉంది. ఇటవల దసరా ముగియగా పండుగల సీజన్ కొనసాగుతోంది. దీంతో పూలధరలకు రెక్కలు రావడంతో పూలరైతుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. హోసూరు పూల మార్కెట్ నుంచి తమిళనాడు రాష్ట్రంలోని పలు ప్రాంతాలతోపాటు పొరుగు రాష్ట్రాలలోని ప్రధాన నగరాలు, పట్టణాలకు ఎగుమతి అవుతోంది. వీటిలో చామంతి, పన్నీర్ రోజాలు రూ.80 నుంచి రూ.250 వరకు అమ్ముడు పోతువుంది, కానీ బటన్ రోజా రూ.100 పలుకుతోంది. హోసూరు నుంచి చాలా వరకు కర్ణాటక రాష్ట్రానికి అమ్మకానికి ఎగుమతి అవుతోంది. గత మూడు నెలలుగా బటన్ రోజాకు వైరస్ సోకడంతో దిగుబడి తగ్గింది. ఇటీవల దసరాలో కీలకమైన ఆయుధపూజ పండుగ సందర్భంగా కేజి బటన్ రోజా రూ.300కు అమ్ముడు కావడంపై రైతులలో ఆనందం వ్యక్తం అవుతోంది. హోసూరు నుంచి బెంగళూరు, చెన్నై మొదలైన ప్రాంతాలకు రవాణా అవుతోంది.



హోసూరు మార్కెట్‌లో పూల దుకాణాలు

ఘనంగా కన్యక పూజలు



పూజలు నిర్వహిస్తున్న పండితులు

హోసూరు అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : నవరాత్రి పండుగ అనంతరం కన్యపూజను చేసే సంప్రదాయం ఉంది. అమ్మవారికి ఎంతో విశిష్టత కలిగిన ఈ నవరాత్రి ఉత్సవాల్లో ఆలయాల్లో 9 రోజుల పాటు అమ్మవారిని ప్రత్యేక అలంకరణాలతో పూజించడం ఆనవాయితీ. నవరాత్రి పండుగ సమయంలో ఇళ్లల్లో, దేవాలయాల్లో ఆడపిల్లలకు కన్యపూజలు నిర్వహిస్తారు. సోమవారం తమిళనాడు బ్రాహ్మణసంఘం హోసూరు ఏఎస్‌టీసీ హడ్కో ప్రాంతంలోని రామ మందిరంలో బాలికలకు కన్యపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఆడబిడ్డలను అమ్మవారిగా భావించి తలపై పసుపు కుంకుమలు, కిరీటాలు ఉంచి, పూలమాలలు వేసి కాళ్లపై పూలు చల్లి పూజలు నిర్వహించారు. మున్సిపల్ అధ్యక్షురాలు సుధా నాగరాజన్, సంఘం కార్యదర్శి శ్రీనివాసులు నిర్వాహకులు గణేశ్, బాలు, కృష్ణస్వామి, రోహిణి గణేశ్ తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ - ముగ్గురి అరెస్టు

హోసూరు(క్రైం) అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపాన బేడరపల్లిలో ఒడిశాకు చెందిన ప్రకాశ్‌కుమార్ నాయక్ (33) నివాసముంటున్నారు. కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. అతనితో పాటు బీహార్‌కు చెందిన మునీందర్‌కుమార్ సింగ్(43), వికాశ్‌కుమార్ (30) పనిచేస్తున్నారు. గత రెండు నెలలుగా జీతం చెల్లించలేదు. దీనిపై మునీందర్ కుమార్ సింగ్, వికాశ్‌కుమార్‌లను ప్రశ్నించారు. ఈ విషయంపై తలెత్తిన సమస్య కారణంగానే దాడికి పాల్పడ్డాడని చెబుతున్నారు. దీని ప్రకారం ప్రకాశ్‌కుమార్ నాయక్ ఫిర్యాదు మేరకు మునీందర్ కుమార్ సింగ్, వికాశ్‌కుమార్ ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. దాడి చేశారంటూ మునీందర్ కుమార్‌సింగ్ ఫిర్యాదు మేరకు పోలీసులు వికాశ్ కుమార్ నాయక్‌ను అరెస్టు చేశారు.

కంటైనర్‌ను ఢీకొట్టిన కారు

● నలుగురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు తీవ్రగాయాలు

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న కంటైనర్‌ను కారు ఢీ కొన్న సంఘటన మండలంలోని యర్రంపల్లి సమీపంలో సోమవారం ఉదయం జాతీయ రహదారిపై జరిగింది. ఈ ప్రమాదంలో కర్ణాటకకు చెందిన నలుగురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపిన మేరకు....కర్ణాటక రాష్ట్రం గుల్బర్గాకు చెందిన వీరేశ్, సంగనాథ్, సిద్దలింగ, హరీశ్‌లు గుల్బర్గా నుంచి కారులో బెంగళూరుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో యర్రంపల్లి సమీపంలోకి రాగానే కారు ప్రమాదవశాత్తు రోడ్డు పక్కన ఆపి ఉన్న కంటైనర్ వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీ కొంది. ఈ ప్రమాదంలో నలుగురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని క్షతగాత్రులను సీకేపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. కాగా ప్రమాదంలో కారు నుజ్జునుజ్జైంది. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మొక్కజొన్నకు మొలకలు.. రైతుల్లో ఆందోళన

బళ్లారి సిటీ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న పంటకు మొలకలు రావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విజయనగరం జిల్లా హరపనహళ్లి తాలూకాలోని చిగటేరి గ్రామానికి చెందిన ఎస్.బసవరాజు గౌడ అనే రైతు తన పొలంలో మొక్కజొన్న పరిస్థితిపై ఆవేదన వ్యక్తం చేశారు. రైతు మూడెకరాల పొలంలో మొక్కజొన్న సాగు చేశారు. సకాలంలో వర్షాలు కురిసి ప్రతి దశలోనూ పంటను సాగుచేశాడు. ఇటీవల భారీ వర్షాల కారణంగా భూమిలో తేమ శాతం పెరిగి 50శాతం మొక్కజొన్న నేలకొరిగి కంకుల్లో విత్తనాలు మొలకెత్తాయి. ఆయన భూమిలోనే కాదు పక్క రైతుల భూముల్లోనూ ఇలాంటి మొలకలు వచ్చాయి. జిల్లాలో మొక్కజొన్న ధాన్యాగారంగా పేరు గాంచిన హరపనహళ్లి 75,000 హెక్టార్లలో మొక్కజొన్న సాగు చేశారు. ఇప్పటికే 50శాతం పంటలు బాగా పండాయి. అయితే మొలకెత్తిన పంటతో అన్నదాతలో ఆందోళన మొదలయ్యింది. వ్యవసాయ శాస్త్రవేత్తలు తగిన సూచనలు అందజేసి పంటను కాపాడేలా చూడాలని కోరుతున్నారు.



మొలకలు వచ్చిన కంకులు